ప్రజాశక్తి

బుధవారం 19 జులై 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

నేడు స్థాయీ సంఘ ఎన్నికలు

◆ జివిఎంసి బరిలో వైసిపి, టిడిపి అభ్యర్థులు ◆ ఎన్నికలకు దూరంగా సిపిఎం, సిపిఐ, జనసేన

◆ స్టాండింగ్ కమిటీ అక్రమాల కోటరీగా మారినందునే ఈ నిర్ణయం : సిపిఎం కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికలు బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరుగనున్నాయి. ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి నుంచి పలువురు కార్పొరేటర్లు బరిలో ఉన్నారు. అధికారంలో ఉన్న వారే స్థాయీ సంఘం సభ్యులుగా ఎన్నికవడం పరిపాటి. స్టాండింగ్ కమిటీ స్వప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ, నగర ప్రజల ప్రాధాన్యతలను పట్టించుకోకపోవడంతో మిగతా పక్షాలు ఎన్నికకు దూరం జరుగుతూ వస్తున్నాయి. సిపిఎం, సిపిఐ ఈ స్థాయీ సంఘ ఎన్నికలను బహిష్కరించాయి. జనసేన, బిజెపి కూడా ఇదే తోవలో నడుస్తున్నాయి. కార్పొరేషన్‌లో పార్టీల బలాబలాలు చూస్తే.. ప్రధానంగా అధికార వైసిపికి 63, టిడిపికి 27 మంది కార్పొరేటర్లు ఉన్నారు. జనసేనకు ముగ్గురు, బిజెపి, సిపిఎం, సిపిఐలకు ఒక్కొక్క కార్పొరేటర్ ఉన్నారు. జివిఎంసి అధికారులు స్థాయీ సంఘం ఎన్నికల్లో పోటీల్లో ఉన్న కార్పొరేటర్లకు లభించిన ఓట్లను బట్టి పది మంది సభ్యులతో కూడిన స్థాయీ సంఘాన్ని బుధవారం సాయంత్రానికి వెల్లడిస్తారు.



ఎన్నికలకు సిద్ధమైన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని గది

10 మంది సభ్యుల ఎన్నిక ఇలా..

ఒక స్టాండింగ్ కమిటీ కాలపరిమితి ఏడాది కాలం. ఇప్పటికి రెండు బ్యాచ్‌లుగా అధికార పార్టీ నాయకులే స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. అత్యధిక మంది కౌన్సిల్‌లో వైసిపి వాళ్లే అయినందున సహజంగా గెలుపు వారికే దక్కుతుంది. ప్రతి స్టాండింగ్ కమిటీ ఎన్నిక సందర్భంగా 10 మందిని ఎన్నుకోవాలి. వైసిపి కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచిన స్థానాలు 54 కాగా, తెలుగుదేశం 31 గెలుపొందింది. 2019 కొద్దిమంది వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఇంకొందరు తటస్థంగా ఉన్నారు. దీంతో టిడిపి సంఖ్యా బలం దాదాపు ఇప్పుడు 27-28 మధ్య ఉంది. వైసిపి కార్పొరేటర్ల బలం సుమారు 60 పైచిలుకు చేరింది. స్టాండింగ్ కమిటీ ఎన్నికల సందర్భంగా ఒక్కో

మిగతా 2లో..

డిసిసిబి చైర్మన్‌గా కోలా గురువులు

గురువులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డిసిసిబి) చైర్మన్‌గా కోలా గురువులు నియమితులయ్యారు. రాష్ట్రంలో కొత్తగా నాలుగు జిల్లాలకు డిసిసిబి చైర్మన్లను, పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆ నలుగురిలో కోలా గురువులు ఒకరు. దక్షిణ నియోజకవర్గానికి చెందిన కోలా గురువులు వైసిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్నారు. 2014 ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. అయినప్పటికీ నిరాశ చెందకుండా పార్టీలో కొనసాగారు. రెండేళ్ల క్రితం రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. కొద్ది మాసాల క్రితం శాసనసభ్యుల ద్వారా శాసన మండలికి జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్సీగా వైసిపి తరుపున పోటీచేసిన ఆయన ఒక్క ఓటు తేడాతో ఓటమి చెందారు. ఈ పూర్వ రంగంలో గురువులను డిసిసిబి ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయం తెలియడంతో దక్షిణ నియోజకవర్గంలో వైసిపి కార్యకర్తలు హర్షం వెలిబుచ్చారు.

రాజకీయ దురుద్దేశం కోసమే యుసిసి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాజకీయ దురుద్దేశం కోసమే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉమ్మడి పౌర స్మృతి అంశాన్ని ముందుకు తీసుకొచ్చిందని, ఈ అంశమేమీ దేశ యోగక్షేమాలకు సంబంధించినది ఎంత మాత్రమూ కాదని భారత్ బచావో విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ అన్నారు. భారత బచావో జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో యుసిసి, ఉమ్మడి పౌరస్మృతి అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుసిసిపై పౌర సమాజం సమగ్రంగా

మిగతా 2లో..

అణుకు సమస్యలపై ఇంత నిర్లక్ష్యమా?

▶ వార్త 8లో..

ఒంటరి మహిళపై వైసిపి సర్పంచ్ దౌర్జన్యం

▶ వార్త 5లో..

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

▶ వార్త 2లో..

విశాఖలో చెక్కు అందజేస్తున్న కలెక్టర్, మేయర్, ప్రజాప్రతినిధులు

'జగనన్న తోడు' విడుదల

విశాఖ, అనకాపల్లిల్లో చెక్కుల అందజేత

వార్త 5లో..

సమస్యలపై ఆశాల ధర్నాలు

పనిభారం తగ్గించాలని, వేధింపులు ఆపాలని డిమాండ్

పని భారం తగ్గించాలని, వేధింపులు ఆపాలని, జాబ్ ఛార్ట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఆశాలు మంగళవారం పెద్ద సంఖ్యలో ధర్నాకు దిగారు. దీంతో ఆయా జిల్లాల డిఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయాలు నినాదాలతో దద్దరిల్లాయి. జోరు వానలోనూ ఆశాలు పట్టువిడవకుండా ఈ ఆందోళనను కొనసాగించారు. వారికి పలు సంఘాల మద్దతు లభించింది.

అనకాపల్లి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

విశాఖలో నినదిస్తున్న వందలాది మంది ఆశా కార్యకర్తలు

ప్రజాశక్తి - సీతమ్మధార : విశాఖలోని రామాటాకీస్ వద్దనున్న డిఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయం వద్ద ఆశాలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షులు పి.మణి, అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.పద్మ, వి.మేరీ మాట్లాడారు. ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించరాదని,

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

నేడు స్థాయీ సంఘ ఎన్నికలు

కార్పొరేటర్ 10 ఓట్లు వేయాల్సి ఉంటుంది. 54 ఓట్లు ఎవరికి వస్తాయో వారిదే గెలుపు. ఈ లెక్కన వైసిపికే గెలుపు అవకాశం ఉంది.

ప్రధాన పార్టీల నుంచి ఖరారైన అభ్యర్థుల జాబితా ఇదే..

వైసిపి నుంచి భీమిలి అసెంబ్లీ సెగ్మెంట్ ఒకటో వార్డు నుంచి అక్కరమాని పద్మ, తూర్పు నుంచి 23వ వార్డు కార్పొరేటర్ గుడ్ల సత్యవిజయ, పశ్చిమం నుంచి 62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు, ఉత్తరం నుంచి 47వ వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజని, దక్షిణ నియోజకవర్గం 41వ వార్డు నుంచి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, 29వ వార్డు నుంచి ఉరుకూటి నారాయణరావు, గాజువాక నుంచి 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, పెందుర్తి నియోజకవర్గంలోని 61వ వార్డు నుంచి కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, అనకాపల్లి నియోజకవర్గంలోని 81వ వార్డు నుంచి కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య బరిలో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ స్టాండింగ్ కమిటీ అభ్యర్థులుగా 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, ఏడో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, 19వ వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్నం, 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, 38వ వార్డు కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి, 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, 98వ వార్డు కార్పొరేటర్ పిసిని వరహానరసింహం, 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి బరిలో నిలిచారు.

స్టాండింగ్ కమిటీ అధికార పార్టీ కోటరీగా తయారైంది

: సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

'స్టాండింగ్ కమిటీలో జరిగే నిర్ణయాలు లక్షల సంఖ్యలో ఉండే నగర ప్రజలకు ఉపయోగపడేవిగా ఉండాలి. కానీ ఎన్నికయ్యే వారంతా ఒక కోటరీగా స్టాండింగ్ కమిటీలో ఏర్పడి తమకు కావాల్సిన పనులను పెద్ద ఎత్తున అజెండాగా పెట్టించుకుని లాభం పొందుతూ అక్రమాలకు పాల్పడుతున్నారు. అందుకే సిపిఎంగా ఈ ఎన్నికల్లో పాల్గొనకూడదని నిర్ణయించుకున్నాం' అని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు చెప్పుకొచ్చారు.

సమస్యలపై ఆశాల ధర్నాలు

వెంటనే జాబ్ ఛార్ట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీచ్ క్లీనింగ్ ప్రోగ్రామ్ నుంచి ఆశాలను మినహాయించాలని, అధికారుల బెదిరింపులు, వేధింపులు ఆపాలని అన్నారు. ఆన్‌లైన్ వర్క్స్ భారాన్ని తగ్గించాలని కోరారు. నాణ్యమైన సెల్ ఫోన్స్, 4జి సిమ్స్ ఇవ్వాలన్నారు. ఆశాల బదిలీలను తక్షణం చేపట్టాలన్నారు. ప్రతి వెయ్యి జనాభాకు ఒక ఆశాను నియమించాలన్నారు. ప్రభుత్వమే రికార్డులు సరఫరా చేయాలని, ప్రసూతి సెలవులు, మెడికల్ లీవ్స్ వెంటనే అమలు చేయాలని అన్నారు. సచివాలయాల డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రిజిస్టర్‌లో ప్రతిరోజూ సంతకాలు చేయించడం వెంటనే ఆపాలన్నారు. పిహెచ్‌సికి పిలిపించిన ప్రతి సందర్భంలోనూ టిఎ, డిఎలు ఇవ్వాలన్నారు. ఇతర సమస్యలనూ పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా స్పందించిన డిఎం అండ్ హెచ్ఒ జగదీశ్వరరావు మాట్లాడుతూ తన పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తానన్నారు. ఆశాలకు సంబంధం లేని పనులు చేయవద్దన్నారు. ఆశాల ధర్నాకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కార్యదర్శి జి.అప్పలరాజు, ఐద్వా సహాయ కార్యదర్శి వరలక్ష్మి మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో వై.సీతారత్నం, అనురాధ, ఆదిలక్ష్మి, అన్నపూర్ణ, భారతి, భాను, హేమలత, కుమారి, లక్ష్మి, వై.పద్మ, రవణమ్మ, రేణుక, సన్యాసి పైడమ్మ, సరస్వతి, సరోజిని, శ్యామల, సుజాత, వరలక్ష్మి, విజయలక్ష్మి, దయనా, దేవి, కనకరత్నం, లీలా, సత్యవతి, ఎర్రయమ్మ, ఉమ పాల్గొన్నారు.

అనకాపల్లి : ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణంలోని సిఐటియు కార్యాలయం నుంచి నెహ్రూ చౌక్ జంక్షన్, మున్సిపల్ స్టేడియం మీదుగా భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శాంతి, ఇ.పార్వతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.సత్యవతి మాట్లాడుతూ తమపై పనిభారం, వేధింపులు ఆపకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆన్‌లైన్ లేదా రికార్డ్స్ ఒక పని ఒకేసారి చేసేలా చూడాలన్నారు. సచివాలయం, సబ్ సెంటర్లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చోబెట్టే విధానాన్ని విరమించుకోవాలన్నారు. రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వరలక్ష్మి, రామలక్ష్మి, రమణమ్మ, సూర్యకళ, అరుణ, లక్ష్మి, చిట్టెమ్మ పాల్గొన్నారు.

రాజకీయ దురుద్దేశం కోసమే యుసిసి

చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారత్ బచావో ఉత్తరాంధ్ర జోనల్ చైర్మన్ గూడూరు సీతా మాలక్ష్మి మాట్లాడుతూ యుసిసి డ్రాఫ్ట్ కూడా తయారు చేయకుండా చట్టం చేస్తామని బిజెపి అనడం హాస్యాస్పదమన్నారు. యుసిసి బిజెపి ఎన్నికల రాజకీయ నినాదమని, ఆ నినాదంతో మతాల మధ్య విద్వేషాలు పెంచి ఓట్లను పోలరైజ్ చేసి తిరిగి అధికార పీఠం ఎక్కే ఎత్తుగడ అని పేర్కొన్నారు. ఎస్ఆర్.వేమన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

'మీతో ఆనంద్' యాప్ ఆవిష్కరణ

యాప్‌ను ఆవిష్కరిస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - విశాఖపట్నం : సిఎం క్యాంప్ ఆఫీసులో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో విశాఖ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త, ఏపిఎంఎస్ఎంఇ ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజల సౌకర్యార్థం, వారి సమస్యల పరిష్కారం కోసం మీతో ఆనంద్ యాప్‌ను సిఎం ఆవిష్కరించారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఆడారి ఆనంద్ కుమార్ చేసిన ఈ చిరు ప్రయత్నాన్ని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్ లేనివారు లేరని ... 'మీతో ఆనంద్' యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే ఆనంద్ మీతో ఉన్నట్లేనని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను అప్లోడ్ చెయ్యడం నుంచి అవి పరిష్కారమయ్యే వరకు ట్రాక్ చెయ్యొచ్చని ఆనంద్ ఈ సందర్భంగా సిఎంకు తెలియజేశారు. నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. అలాగే సిఎం దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లగా ఆయన జివిఎంసి 52, 57 , 62వ వార్డుల్లో మూడు ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్లను మంజూరు చేశారు. నియోజకవర్గంలోని మిగతా సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

ఎయులో వేధింపుల ఘటనపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో హిందీ విభాగాధిపతి ఆచార్య నల్ల సత్యనారాయణ పిహెచ్‌డి విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు వై.రాంబాబు, అచ్యుతరావు ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎయు ప్రధాన ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు.

తానా ఫౌండేషన్ ట్రస్టీగా సతీష్

ఎంవిపి.కాలనీ : సేవా తత్పరుడు సతీష్ మేకా అమెరికాలోని ప్రతిష్టాత్మక 'తానా' ఫౌండేషన్ ట్రస్టీగా నియమితులయ్యారు. నాలుగేళ్ల పాటు ఆయన ఆ పదవిలో ఉంటారు. తనను ఈ పదవికి ఎంపిక చేసిన తానా బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌తో పాటు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ సతీష్ ఈ సందర్భంగా మంగళవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. సతీష్ ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల మెరుగైన చదువు కోసం 25కు పైగా డిజిటల్ క్లాస్ రూంలు ఏర్పాటు చేయించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా జర్నలిస్టులు సహా పలువురికి వైద్య సాయం అందించారు. తానా ఫౌండేషన్ ట్రస్టీ విద్యాధర్ గారపాటితో కలిసి అనేక సేవా కార్యక్రమాలలో కీలక పాత్ర పోషించారు. క్యాన్సర్ నివారణ, అవగాహనపై బసవతారకం క్యాన్సర్ హాస్పటల్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్‌తో కలిసి వందకు పైగా వైద్యశిబిరాలు నిర్వహించారు. ప్రస్తుత బోర్డు ఆఫ్ డైరెక్టర్ జనార్దన్ నిమ్మలపూడి చేపట్టిన తానా బసవతారకం క్యాన్సర్ ప్రాజెక్ట్‌లో ముఖ్య భూమిక పోషించారు. కరోనా విపత్కర సమయంలో 5 వేల ఆక్సిజన్ కాన్‌సెంట్రేటర్లు అందజేయడంలో సతీష్ కీలక పాత్ర పోషించారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర సహాయ కార్యదర్శి వేపాడ సత్యనారాయణ డిమాండ్ చేశారు. విద్యుత్తు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఉద్యమ సన్నాహక రాష్ట్ర సదస్సు జరుగుతుందని తెలిపారు.

ఆ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆయన మంగళ వారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆవిష్కరించారు. సమావేశంలో యూనియన్ రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, ఆర్.సత్యారావు, చంద్రరావు, కొండలరావులతోపాటు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి నాయకులు సాయి, శంకరరావు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL - CUM – I ADDITIONAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
M.O.P. 766/2021

Between:
Bonela Kamalamma and others ......Petitioners
And:
Gannu Srihari and others .....Respondents

R-2 : Sri Sairam Tractor, Reptd. By its proprietor, Pradhana Rajendra Prasad, Owner of Lorry Baraing No. AP 31 TN 3180, Residing at 7-79/3, Opp: NGO's Colony, College Junction, Kotturu, Anakapalli, Visakhapatnam District.

NOTICE

Please take notice that the above O.P., stands posted to **18-08-2023** for notice to the 2nd respondent for appearance before the Honourable Court. You should appear in person or through an advocate at **10-30 AM on 18-08-2023** in the above court.

If you not appear on the said date the above matter will be decided exparte.

P.A.N. Raju
Advocate for the petitioner
Vizianagaram

IN THE HONORABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE CUM MACT AT SRIKAKULAM.
MVOP No. 71/2023

Between: **పల్లి రామ కుమారి మరియు ఇతరులు** ..పిటిషనర్లు
And: **బొంతి ఏలియాస్ బుల చంటి మరియు ఇతరులు** ..రెస్పాండెంట్స్
To, **R-1. బొంతి ఏలియాస్ బులాచంటి** తండ్రి నారాయణమూర్తి వయస్సు 37 సంవత్సరాలు హిందు, లారీ డ్రైవర్, నెంబర్ AP31T 8642, రెసిడెంట్ ప్లాట్ నెంబర్ 410 కొత్తపాలెం, ఫార్మాసిటీ కాలనీ, గాజువాక మండలం విశాఖపట్నం డిస్ట్రిక్, నేటివ్ ఆఫ్ కవన గురువు గ్రామము,అమలాపురం మండలం, తూర్పు గోదావరి జిల్లా.

నోటీసు

పై నెంబరు గల Petitioners నష్టపరిహారము కోరుతూ పై పిటిషన్ దాఖలు చేసి యున్నారు. సదరు విషయమై రెస్పాండెంట్No.1కు నోటీసు నిమిత్తము **24-07-2023 దీన ఉదయం 10 .30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట వాయిదా అయి ఉన్నది కావున మీరు స్వయంగా గాని, వకీల్ ద్వారా గాని మీరు హాజరు కావలెను లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించడం అవునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

// By order of District Judge Court //

A. ఆటకేశ్వరరావు
చింతాడ తిరుపతి స్వామి
Petitioner తరపున న్యాయవాదులు,
శ్రీకాకుళం,
Cell 9441012425.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.1826/2022

Between :
STATE BANK OF INDIA, SME Centre, Visakhapatnam, Rep. by its Manager ...Plaintiff
And:
M/s. Vijaylaxmi Electrical, Rep. by its Prop: Sardar Singh Deep Singh & Another ...Defendants

SUMMONS

To,
D-1: M/s. Vijaylaxmi Electrical, Rep. by its Prop: Sardar Singh Deep Singh S/o. Sardar Singh, D.No.32-26-30, Geet Sangeet Road, Allipuram, Visakhapatnam-04
D-2: Sardar Singh Deep Singh, S/o. Sardar Singh, Hindu, aged about 35 years, Prop: of M/s. Vijaylaxmi Electrical, D.No.32-26-30, Geet Sangeet Road, Allipuram, Visakhapatnam-04

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **11-10-2023** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **11-10-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
K. VEDAVATHI,
Advocate
Balaji Nagar, Siripuram, Visakhapatnam.

IN THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION-II, AT: VISAKHAPATNAM
C.C.358/2022

Between:
Smt. Pemmadi Padmavathi ...Complainant
And:
The New India Assurance Co. Ltd., (Head Office) Mumbai & 2 others ...Opposite Parties

NOTICE

To,
Opposite Party No.3:
M/s. Good Health Insurance TPA Limited,
At Near GVK Plaza, Seethammapeta, Dwaraka Nagar, Visakhapatnam-530016.

Please take notice that the above named complainant filed C.C.358/2022 against the opposite party No.3 and the matter stands posted to **27-07-2023** for your appearance before the Hon'ble District Consumer Disputes Redressal Commission-II, VUDA Complex, Siripuram, Visakha patnam at **10.30 A.M.** either yourself in person or by authorized person, failing which the Hon'ble Commission will be proceed with the matter as per law.

(As per the Orders of the Hon'ble Commission-II)
P.S.N. RAJU & ARVIND DESHMUKH
Advocates,
Visakhapatnam.

IN THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION-II, AT: VISAKHAPATNAM
C.C.360/2022

Between:
Sri P.S.N. Raju ...Complainant
And:
The New India Assurance Co. Ltd., (Head Office) Mumbai & 2 others ...Opposite Parties

NOTICE

To,
Opposite Party No.3:
M/s. Good Health Insurance TPA Limited,
At Near GVK Plaza, Seethammapeta, Dwaraka Nagar, Visakhapatnam-530016.

Please take notice that the above named complainant filed C.C.360/2022 against the opposite party No.3 and others and the matter stands posted to **27-07-2023** for your appearance before the Hon'ble District Consumer Disputes Redressal Commission-II, VUDA Complex, Siripuram, Visakha patnam at **10.30 A.M.** either yourself in person or by authorized person, failing which the Hon'ble Commission will be proceed with the matter as per law.

(As per the Orders of the Hon'ble Commission-II)
P.S.N. RAJU & ARVIND DESHMUKH
Advocates,
Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT AND SESSIONS JUDGE AT: VISAKHAPATNAM
I.A. 60/2023 in O.S.443/2015

Between:
Sri Potnuru Ramu and others .....Petitioners/Plaintiffs
And:
Sri Yeturi Ramalinga Reddy and others ...Respondents/Defendants

NOTICE

To,
R-1: Sri Yeturi Ramalinga Reddy, S/o. Sri Sesha Reddy, Hindu, aged about 55 years, SF-4, Sowkhya Apartments, Palace Layout, Pedawaltair, Visakhapatnam-17.
R-2: Sri Yeturi Vijayalakshmi, W/o. Y. Ramalinga Reddy, Hindu, aged about 47 years, Rest-do.

Notice is hereby given that the above named petitioners/plaintiffs filed the above I.A.60/2023 seeking the above named Court to restore the above suit to file pursuant to the order dated 04-10-2018 in A.S.No.1029/2018 of the Hon'ble High Court of Andhra Pradesh. The said application stands posted to **07-08-2023** for notice of your appearance by way of publication in news paper.

You are therefore required to appear in the above named Court at **10:30 A.M.** on **07-08-2023** either in person or by a pleader able to answer the above petition failing which the matter will be decided in your absence and disposed of exparte.

(By Order of the Hon'ble Court)
B.A. RAJA RAO
Advocate, Visakhapatnam
Visakhapatnam.

మౌలిక వసతులు కల్పించలేకపోతున్నాం

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆవేదన

సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ చందక లక్ష్మి

ప్రజాశక్తి -ఆనందపురం : నిధులు లేక గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించలేకపోతున్నామని మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముందు సర్పంచులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక ఆధ్వర్యాన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మామిడిలోవ ఎస్‌సి, బిసి కాలనీలకు తాగునీటి కుళాయిలు ఏర్పాటుచేయలేకపోయామని, ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదని, దబ్బందలో ల్యాండ్ పూలింగ్ రైతులకు పట్టాలు, పరిహారం ఇవ్వలేదని మామిడిలోవ సర్పంచ్ బలిరెడ్డి మల్లికార్జునరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెం దొంతలవారి కల్లాలలో జల జీవన మిషన్ ద్వారా మంచినీటి కుళాయిలు ఏర్పాటుకు శంకుస్థాపన చేసినా నేటికీ పనులు పూర్తి కాలేదని సర్పంచ్ చందక లక్ష్మి సభ దృష్టికి తీసుకొచ్చారు. నాలుగేళ్ల క్రితం దొంతలవారి కల్లాలు రోడ్డు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారని, దీంతో గుంతలు ఏర్పడి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని సభలో లేవనెత్తారు. తర్లువాడ గ్రామంలో మంచినీటి సమస్యపై సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు, పందలపాక పంచాయతీ గంటాపేటలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని ఎంపిటిసి విజనగిరి అప్పలనాయుడు, ఆనందపురం జంక్షన్ నుంచి బిపి కల్లాలకు వెళ్లే రోడ్డుకు నిధులు కేటాయించాలని సర్పంచ్ కోన పైడిరాజు(శ్రీను, ముచ్చర్ల గ్రామంలో 60 స్తంభాలకు వీధి లైట్లు లేవని, నిధులు మంజూరుచేయాలని, గ్రామానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ సర్పంచ్ షినగం ఎర్రయ్య, చందక గ్రామపంచాయతీలో లో-వోల్టేజ్ సమస్య ఉందని, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయాలని ఆ బంక శ్రీను సభలో ప్రస్తావించారు.

మౌలిక వసతులపై దృష్టి : ముత్తంశెట్టి

గ్రామాలలో మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేకమైన దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో సమస్యలు లేకుండా ప్రత్యేకమైన దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, మురుగు కాలువలు, రోడ్ల నిర్మాణాలపై దృష్టి పెట్టాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. హౌసింగ్ కాలనీలను త్వరగా పూర్తిచేయించి గృహప్రవేశాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు, జడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైస్ ఎంపిపిలు పాండ్రంకి శ్రీను, బొట్ట ధనలక్ష్మి, సర్పంచులు గంట జగదీశ్వరరావు, గండ్రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

గొల్లపల్లిలో మీనామృతం తయారీని వివరిస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-యంత్రాంగం

పద్మనాభం : మండలంలోని పెంట, పొట్నూరు గ్రామాల్లో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు గ్రోత్ ప్రమోటర్లు అవగాహన కల్పించారు. ఈ పద్ధతి వల్ల రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని గ్రోత్ ప్రమోటర్లు తెలిపారు. రైతుల సమక్షంలో 50 కేజీల మీనామృతం తయారు చేశారు. పెంట గ్రామంలోని కార్యక్రమంలో బి.సంతోష్, బి.దుర్గారావు, సర్పంచ్ బోదల పావని తదితరులు పాల్గొన్నారు.

పొట్నూరు గ్రామంలో రైతు కారపు ప్రసాద్ ప్రకృతి పద్ధతిలో వరిని పండించేందుకు ముందుకు గ్రోత్ ప్రమోటర్ ఆర్.మీనా సమక్షంలో స్వయంగా మీనామృతం తయారు చేసే పద్ధతిని తెలుసుకున్నారు.

పెందుర్తి : మండలంలోని గొల్లపల్లిలో మీనామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిపిఎం మోహనరావు మాట్లాడుతూ, మీనామృతంతో మంచి పంట దిగుబడి వస్తుందన్నారు. పంట సమయంలో రెండుమూడు సార్లు మీనామృతం పిచికారీ చేస్తే అధిక దిగుబడి పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఎంటి బి.పద్మ, ఐసిఆర్‌పిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ సేవలు

ప్రజాశక్తి-పద్మనాభం : ప్రతి ఇంటికీ ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని మద్ది, బాందేవుపురం గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ 26 రకాల సేవా కార్యక్రమాలు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా అవసరమైన ధ్రువపత్రాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మద్దిలో 402 మందికి, బాందేవుపురంలో 155 మందికి పలు సర్టిఫికెట్లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, జెడ్‌పిటిసి ఎస్.గిరిబాబు, సర్పంచ్ బి.సన్యాసమ్మ ఎంపిడిఒ ఎం.విజయకుమార్, కార్యదర్శి రఘు, నాయకులు బంగారప్పడు, ఎం.అప్పలనాయుడు, పి.మహేష్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరానగర్ 11 కెవి ఫీడర్ నిర్వహణ, చెట్టు కొమ్మల నరికివేత, విద్యుత్ దీపాల లైన్ల మరమ్మత్తుల్లో భాగంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఎఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్ పరిసర ప్రాంతాలకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కురిసిన వర్షం.. రైతులకు ఉపశమనం..

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలో మంగళవారం అడపా దడపా వర్షం కురిసింది. ఇప్పటి వరకు చుక్క చినుకు కోసం నింగికేసి ఆత్రంగా ఎదురుచూస్తున్న రైతులకు ప్రస్తుతం కురిసిన వర్షం కాసింత ఉపశమనం కలిగిందని చెప్పవచ్చు. మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కేవలం 20 నుంచి 30 శాతం నార్లు మాత్రమే పడ్డాయి. వ్యవసాయ బోర్లు ఉన్న చోట మాత్రమే రైతులు నాట్లు వేశారు. ఇప్పటి వరకు కాపులుప్పాడలోనే బోర్ల కింద ఉడుపులు జరిగాయి. మండలంలో వరి పంట సాధారణ విస్తీర్ణం 1342 ఎకరాలుగా ఉంది.

విత్తన పంపిణీ ఇలా..

మండలంలోని 11 ఆర్‌బికెల ద్వారా వరి (1121) 210 క్వింటా ళ్లు, సాంబ మసూరి 71, సోనామసూరి 67, ఆర్‌జిఎల్ 18, పెసర 2.48, జనుము 6.4, జీలుగు 11 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి బి.శివకోమలి మంగళవారం ప్రజాశక్తికి తెలిపారు. విత్తన కొరత లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

వ్యవసాయ డ్రోన్లకు రాయితీ

ప్రజాశక్తి -ఆనందపురం : కూలీల కొరత, సమయాభావం అధిగమించడానికి వ్యవసాయంలో ఉపయోగించే డ్రోన్లకు రాయితీ ఇస్తున్నట్లు వ్యవసాయ శాఖాధికారి సంధ్యా రత్నప్రభ తెలిపారు. రైతుభరోసా కేంద్రాల పరిధిలో సిహెచ్‌సి గ్రూప్ ద్వారా డ్రోన్లను 40 శాతం రాయితీపై అందించనున్నట్లు పేర్కొన్నారు. సిహెచ్‌సి గ్రూప్ మెంబర్లు డ్రోన్లు వాడటానికి అంగీకార పత్రం రాసుకురావాలని తెలిపారు. ఐటిఐ, ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన వారికి 15 రోజుల పాటు ఉచితంగా డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇస్తామని చెప్పారు. పురుగుమందులు పిచికారీ, విత్తనాలు, ఎరువులు చల్లడానికి కూడా వీటిని ఉపయోగించవచ్చని తెలిపారు. వీటి ధర సుమారు రూ.10 లక్షల నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. దానిలో 10 శాతం సిహెచ్‌సి గ్రూపు కడితే, ప్రభుత్వం 40 శాతం రాయితీ, బ్యాంకు 50 శాతం రుణసదుపాయం కల్పిస్తుందని వివరించారు.

ఆటో కార్మికులపై జరిమానాలు ఆపాలి

సిఐటియు

సిఐటియు ఆధ్వర్యాన కొమ్మాది కూడలిలో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి -మధురవాడ : ఆటో కార్మికులపై ఆంక్షలు, విపరీతమైన జరిమానాలు విధించడం ఆపాలని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) నగర అధ్యక్షులు పి.రాజుకుమార్ డిమాండ్‌చేశారు. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొమ్మాది కూడలిలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజుకుమార్ మాట్లాడుతూ, ఆటోలను ట్రాఫిక్‌లో నిలిపినప్పుడు, పాసింజర్లను దించినప్పుడు రాంగ్ పార్కింగ్ అంటూ పోలీసులు ఫొటోలు తీసి ఈ చలానాలు పంపడం అన్యాయమన్నారు. ట్రాఫిక్ సమస్య ఉందని జాతీయ రహదారిపైకి ఆటోలను మళ్లిస్తుండటంతో ప్రయాణికులను వారి ప్రాంతాలలో దించడం కష్టమవుతుందన్నారు. ప్రయాణికులు సేవా రహదారిలో ఉంటారని, ఆటోలను జాతీయ రహదారిపై పంపడం వల్ల బేరాలు లేకా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆటోల పార్కింగ్ సమస్యలను పరిష్కరించాలని, ఈ చలానాలు రద్దుచేయాలని, వాహన మిత్ర పథకం డ్రైవర్లు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, బి.నాగేశ్వరరావు, జి.చిన్నారావు, టి.రమేష్‌బాబు, డి.రవి, ఎర్రయ్య, ఎం.రాము, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో రేవంత్ కుమార్‌కు గోల్డ్ మెడల్

గోల్డ్ మెడల్‌తో రేవంత్‌కుమార్

ప్రజాశక్తి-ఆనందపురం : 8వ సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని ఆనందపురం పంచాయతీ 24 కాలనీకి చెందిన రేవంత్‌కుమార్ గోల్డ్ మెడల్ సాధించాడు. విశాఖపట్నం మద్రిపాలెంలోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలను ఈ నెల 17న నిర్వహించారు. ఈ పోటీల్లో కుప్ప రేవంత్ కుమార్ (6) పాల్గొని కరాటేలో గోల్డ్‌మెడల్, కుంతీ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. కుప్ప దేవీ ప్రసాద్ బ్రాన్జ్ మెడల్ సాధించాడు.

ఆనందపురంలోని విక్టరీ సూటోకాన్ కరాటే అకాడమీలో కోచ్ టి.సాయికుమార్ వద్ద వీరు శిక్షణ పొందుతున్నారు. ఆనందపురం గ్రామానికి చెందిన కుప్ప రేవంత్‌కుమార్ తాళ్లవలసలోని తిరుమల ఇంగ్లీష్ మీడియం స్కూల్లో రెండో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు కుప్ప రాజశేఖర్ ఆర్మీ ఉద్యోగి. తల్లి కుప్ప రామలక్ష్మి. రేవంత్‌కుమార్ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల తల్లిదండ్రులు, కోచ్ టి.సాయికుమార్ ఆనందం వ్యక్తంచేశారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి దినపత్రిక **ఉద్యోగ అవకాశాలు**

విశాఖపట్నం కేంద్రంలో మార్కెటింగ్ విభాగాల్లో పని చేయుటకు ఉద్యోగాలు ఉన్నాయి.
ఆసక్తిగలవారు మా కార్యాలయానికి వచ్చి సంప్రదించగలరు.

1. గాజువాక డివిజన్ కో-ఆర్డినేటర్ (మార్కెటింగ్)
2. జాబ్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ (ప్రింటింగ్ వర్క్)

- మొదటి ఉద్యోగానికి ఇతర పత్రికలలో మార్కెటింగ్‌లో అనుభవం ఉండాలి. టీంని లీడ్ చేసే సామర్థ్యం ఉండాలి
- 2వ ఉద్యోగానికి ప్రింటింగ్ వర్క్ ఆర్డర్లు బుక్ చేసే అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9490099125, 9490099133

ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం : ప్లాట్ నెం.3, 'జి' బ్లాక్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఆటోనగర్, విశాఖపట్నం-46

స్టీల్‌ప్లాంట్ సరుకు నిలుపుదలపై ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్‌కు రెండు షిప్పుల్లో అదాని గంగవరం పోర్టుకు వచ్చిన బొగ్గును అన్‌లోడ్ చేయకుండా నిలిపేయడాన్ని నిరసిస్తూ, పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోర్టుకు ఆనుకొని ఉన్న గాంధీ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, అదాని గంగవరం పోర్టు బరితెగించి వ్యవహరిస్తోందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో గంగవరం పోర్టు 2011లో చేసుకున్న ఒప్పందం 2026 వరకు ఉందని, దాన్ని ఉల్లంఘించి రూ.50 కోట్లు బకాయి ఉందని సరుకు నిలుపుదల చేసిన యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 1400 ఎకరాల భూమిని గంగవరం పోర్టు తీసుకుందని,

ఒప్పందాన్ని అదాని గంగవరం పోర్టు ఉల్లంఘించింది : గంగారావు

వాస్తవానికి విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఒక బెర్త్‌ను కూడా కేటాయించాల్సి ఉందని తెలిపారు. వీటిని పరిగణలోకి తీసుకోకుండా సరుకు ఎలా నిలుపుదలచేస్తారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అండతో అదానీ రెచ్చిపోతున్నారని విమర్శించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి నిద్ర లేవాలని కోరారు. మాజీ పోలీసు ఉన్నతాధికారులను పోర్టులో నియమించుకొని పోలీసు రాజ్యం చలాయించాలని చూస్తే విశాఖ కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. బొగ్గును వెంటనే దించాలని, లేకుంటే పోర్టు గేట్లను పగులగొట్టి లోపలికి వెళ్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. గంగవరం పోర్టు అదానీ స్వాధీనం అయ్యాక ఛార్జీలు విపరీతంగా పెంచేశారన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించి పాత ఒప్పందం ప్రకారమే చార్జీలు ఉండాలని కోరారు. కుకింగ్ కోల్ నిలుపుదల చేసి స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి ఆటంకం కలిగించాలనే దుర్మార్గమైన ఆలోచనతో అదానీ గంగవరం పోర్టు బిజెపి అండతో రెచ్చిపోతుందన్నారు.

అదానీ గంగవరం పోర్టులో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్‌చేశారు.

ధర్నాలో పాల్గొన్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు తదితరులు

సిపిఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి శ్రీనివాసరాజు మాట్లాడుతూ, బీసీ రోడ్డు వంతెనను పోర్టు నిర్మించకుండా స్టీల్ ప్లాంట్ నిధులతోనే నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. కొద్ది మొత్తంలో బాకీ ఉందని చెప్పి సరుకు దిగుమతి చేయకుండా ఉంచడం తగదన్నారు. సిపిఎం నాయకులు బైరెడ్డి గురప్ప మాట్లాడుతూ, అదానీ గంగవరం పోర్టులో రోజువారి కూలీలకు రూ.200 మాత్రమే చెల్లిస్తూ వెట్టిచాకిరి చేయిస్తున్నారని విమర్శించారు. కొవిరి అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, పాల అప్పలరెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

నినాదాల హోరు

స్టీల్‌ప్లాంట్ సరుకును దిగుమతి చేయకుండా నిలుపుదల చేయడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన ధర్నా నినాదాలతో హోరెత్తింది. పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని అదాని గంగవరం పోర్టుపై చర్యలు తీసుకోవాలని, స్టీల్ ప్లాంట్ కుకింగ్ కోల్‌ను వెంటనే అన్‌లోడ్ చేయాలని, గంగవరం పోర్టులో స్టీల్‌ప్లాంట్ బెర్త్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని, ప్లాంట్‌కు హానిచేస్తున్న అదానీపై చర్య తీసుకోవాలని, అదానీ డౌన్ డౌన్, గేట్లు మూసేస్తాం.. ముట్టడిస్తాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అదే సమయంలో విధులకు వెళ్తున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు కూడా నినాదాలు చేయడంతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. ఈ ధర్నా ఉందని 500 మంది పోలీసులు మోహరించారు. ఎసిపిలు, సిఐలతో ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

'ఉత్తరం' అభివృద్ధిపై వినతి

ప్రజాశక్తి - సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో అభివృద్ధిపై జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, నియోజకవర్గ కార్పొరేటర్లు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ఉత్తర నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై కమిషనర్‌తో చర్చించినట్లు తెలిపారు. అమలుకు ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు సారిపిల్లి గోవింద్, బర్కత్ అలి, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతిశ్రీనివాస్, పి.ఉషశ్రీ, కంటిపాము కామేశ్వరి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజనీఈశ్వరరావు, కెవిఎన్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

సోములును సత్కరిస్తున్న తెలంగాణ సాంస్కృతిక శాఖ ప్రతినిధులు

నందవరపు సోములుకు తెలంగాణ కళాజ్యోతి పురస్కారం

ప్రజాశక్తి -గోపాలపట్నం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాద్‌కు చెందిన శ్రీవాణి గిరిజ సంగీత నాటక కళాసమితి ఆధ్వర్యాన నందవరపు సోములుకు తెలంగాణ రాష్ట్ర కళాజ్యోతి పురస్కారాన్ని అందించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేశారు. జివిఎంసి 92వ వార్డు పరిధి పద్మనాభనగర్‌కు చెందిన నందవరపు సోములు గోపాలపట్నం కళా పీఠాన్ని స్థాపించి ప్రాచీన సంస్కృతి, కళలు పురోగతికి సేవలు అందించారు. అతని సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సోములును ఘనంగా సత్కరించింది.

ఘనంగా మోదకొండమ్మ ఉత్సవం

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం కొండపై ఉన్న మోదకొండమ్మ నెల పండుగ మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్న సమారాధనను ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు ప్రారంభించారు. జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, వైసిపి నాయకులు గొర్లె అప్పలస్వామి నాయుడు, కంపర సత్తిబాబు, కొమ్మునాపల్లి త్రినాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పొడుగుపాలెంలో ఆరోగ్య సర్వే

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెంలో 6వ విడత జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఆనందపురం పిహెచ్‌సి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల బిపి, సుగర్, ఎత్తు, బరువులను పరీక్షించారు. మండలానికి ఒక గ్రామాన్ని సర్వేకు ఎంపిక చేశారు. దీనిలో భాగంగా పొడుగుపాలెంలో చేసిన సర్వే మంగళవారంతో ముగిసింది. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగనాయుడు, డాక్టర్ సహనాజ్ సాదియా, ఎస్‌ఒ మురళీకృష్ణ, సిహెచ్‌ఒ సాంబమూర్తి, హెచ్‌వి పార్వతమ్మ, ఎఎన్‌ఎం పైడిరాజు, హెల్త్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

బూత్‌స్థాయి ఇన్‌ఛార్జిలకు శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి పార్టీ బూత్ స్థాయి, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఓటరు జాబితా ప్రక్రియలో భాగస్వాములు కావాలని పార్టీ శ్రేణులను శిక్షకు హాజరైన మహమ్మద్ గౌస్ తరుణ్, ఆదిత్య కోరారు. పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, పరిశీలకులు కొట్నీ బాలాజీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మండల అధ్యక్షులు డిఎవి రాజు, నాయకులు వానపల్లి సత్య తదితరులు పాల్గొన్నారు

శిక్షణలో మాట్లాడుతున్న కోరాడ రాజబాబు తదితరులు

సిపిఎం నాయకుడు సీతారామయ్య మృతి

నివాళులర్పిస్తున్న జగ్గునాయుడు తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : అరుణోదయ కాలనీకి చెందిన సిపిఎం నాయకులు ఎ.సీతారామయ్య మంగళవారం అనారోగ్యంతో తమ స్వగృహంలో మృతిచెందారు. ఆయన భౌతికాయంపై సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. పార్టీ జోన్ కమిటీ సభ్యులు జి.లక్ష్మి, ఎస్.కృష్ణమూర్తి, డి.శ్రీను, రమణ, ఐద్వా నాయకులు వేణు, లక్ష్మి, ఎస్.లక్ష్మి, ఎస్.అమల, డి.గౌరి నివాళులర్పించారు.

సీతారామయ్య సేవలు మరువలేనివి : జగ్గునాయుడు

అరుణోదయ కాలనీకి సీతారామయ్య చేసిన సేవలు మరవలేనివని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పేర్కొన్నారు. సీతారామయ్య పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అరుణోదయ కాలనీకి తాగు నీరు, పట్టాలు కల్పించడంతో సీతారామయ్య కీలక పాత్ర పోషించారన్నారు. పార్టీ పిలుపునిచ్చిన అన్ని ఉద్యమాల్లోనూ చురుగ్గా పాల్గొన్నారని గుర్తుచేశారు. ఎర్రజెండాతోనే ప్రజలకు మంచి జరుగుతుందని నమ్మారని పేర్కొన్నారు.

20న జనసేనలో పంచకర్ల చేరిక

ప్రజాశక్తి-సీతమ్మధార : తాను ఈనెల 20వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు జనసేన పార్టీలో చేరుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైసిపి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. సీతమ్మధారలోని ఒక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. ఒక సీనియర్ నాయకునిగా నన్ను గుర్తించి జనసేన పార్టీలో ఏ బాధ్యత అప్పగించినా ఒక కార్యకర్తగా పనిచేస్తానని పేర్కొన్నారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మంగళవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వాటిని పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ముగిసిన పెంటమాంబ వార్షికోత్సవం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 74వ వార్డు పరిధి దయాల్‌నగర్‌లోవలో నిర్వహించిన పెంటమాంబ అమ్మవారి వార్షికోత్సవం మంగళవారంతో ముగిశాయి. ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యాన మూడు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం అనుపోత్సవాన్ని ఘనంగా జరిపించారు. ఈ అనుపు మహోత్సవంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

డిఎంహెచ్‌ఒ జగదీశ్వరరావు

ప్రజాశక్తి-సీతమ్మధార : సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులకు డిఎంహెచ్‌ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో వైద్యాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, కుటుంబ నియంత్రణ పాటించాలని సూచించారు. కుటుంబ డాక్టర్ విధానం అన్ని వైఎస్ఆర్ క్లినిక్స్‌లో షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. ఎన్‌సిడిసిడి సర్వే త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఫీవర్ సర్వే చేసి, మలేరియా, డెంగీ వ్యాధులను గుర్తించి వెంటనే తెలియపరచాలని కోరారు. సీజనల్ వ్యాధులు వ్యాపించడానికి వాతావరణ అనుకూల పరిస్థితులు ఉన్నాయని, ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వే నిర్వహించి అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు, పర్యవేక్షక వైద్యాధికారులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ

ఒంటరి మహిళపై వైసిపి సర్పంచ్ దౌర్జన్యం

- ★ 20 ఏళ్లపైబడి వయస్సున్న చెట్లు జెసిబితో తొలగింపు
- ★ బాధితురాలి ఇంటికి వెళ్లే తోవ మూసివేత
- ★ సర్పంచ్‌పై చర్యలు తీసుకొని, బాధితురాలికి న్యాయం చేయాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఒంటరి మహిళపై వైసిపి సర్పంచ్ దౌర్జన్యం చేశారు. ఆ కుటుంబం 20 ఏళ్లగా పెంచుకుంటున్న చెట్లను జెసిబితో తొలగించారు. వాటిని ఆ మహిళ ఇంటికి వెళ్లే మార్గానికి అడ్డుగా వేసి తోవను మూసివేశారు. చెట్ల తొలగింపును అడ్డుకునేందుకు వెళ్లిన ఆ ఒంటరి మహిళను సర్పంచ్ చెయ్యి పట్టుకొని వెనక్కి తోసేశారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి....

కె.కోటపాడు మండలం, వి.సంతపాలెం గ్రామంలో గోగాడ ఈశ్వరమ్మ (ఒంటరి మహిళ) కుటుంబం తమ స్థలంలో 40 సంవత్సరాలుగా నివాసముంటుంది. ప్రధాన రహదారి నుండి తమ నివాసానికి సొంత డబ్బులు రూ.3 లక్షలు ఖర్చు చేసి రోడ్డు (తోవ) ఏర్పాటు చేసుకున్నారు. ఇంటికి వెళ్లే మార్గంలోనూ, చుట్టూ చెట్లు కూడా పెంచుకున్నారు. ఇది ఇలా ఉండగా, వైసిపికి చెందిన ఆ గ్రామ సర్పంచ్ సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో జెసిబిని తీసుకొచ్చి స్థానికంగా కొంత మంది సహకారంతో ఒంటరి మహిళ ఈశ్వరమ్మ కుటుంబం 20 సంవత్సరాల నుంచి పెంచుకున్న కొబ్బరి, వేప, మునగ, నిమ్మ, అరటి, యూకలిప్టస్ చెట్లను తొలగించారు. ఆ చెట్లను ఈశ్వరమ్మ కుటుంబం నిర్మించుకున్న తోవకు అడ్డంగా వేసి తోవ మూసివేశారు. చెట్లు తొలగింపును అడ్డుకునేందుకు వెళ్లిన ఈశ్వరమ్మ చెయ్యిను సర్పంచ్ పట్టుకొని వెనక్కి లాగేసి దౌర్జన్యం చేశారు.

జెసిబితో చెట్టును తొలగిస్తున్న దృశ్యం

సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

సంఘటనా స్థలాన్ని మంగళవారం సిపిఎం మండల కార్యదర్శి ఆర్.ముత్యాలనాయుడు, నాయకులు ఎర్ర దేముడు, వి.సూర్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈశ్వరమ్మ కుటుంబం ఇంటికి వెళ్లే రోడ్డు, వారు పెంచిన చెట్లు బంజరు భూమిలో ఉన్నాయని కొన్ని సంవత్సరాలు క్రితం రెవెన్యూ అధికారులకు అందిన ఫిర్యాదు మేరకు నాటి తహశీల్దారు వచ్చి పరిశీలించారని, ఇళ్లకు వెళ్లే దారిని తొలగించకూడదని చెప్పి, చెట్లు ఉన్న భూమిలో బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఆ భూమి ప్రభుత్వ అవసరాలకు ఏమైనా అవసరమైతే అనుభవంలో ఉన్న ఈశ్వరమ్మకు ముందుగా రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చిన తరువాత రెవెన్యూ వారు మాత్రమే చర్యలకు వెళ్లాల్సి ఉందని, దారి మూసివేయడానికి వీళ్లేదని పేర్కొన్నారు. కాని ఇక్కడ ఆ భూమి ప్రస్తుతం ప్రభుత్వానికి అవసరం లేదని, ఈశ్వరమ్మకు రెవెన్యూ అధికారులు ఎటువంటి నోటీసు ఇవ్వలేదని తెలిపారు. కాని ఎటువంటి సంబంధం లేని సర్పంచ్ దౌర్జన్యం చేసి చెట్లు తొలగించి, దారి మూసి వేశారని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. అలాగే 20 సంవత్సరాలు వయసున్న చెట్లు తొలగించేటప్పుడు సంబంధిత అధికారుల నుండి అనుమతి తీసుకోవాల్సి ఉందని, కాని సర్పంచ్ అవేవీ లేకుండానే ఒక వీధి రౌడీలా ప్రవర్తించి దౌర్జన్యం చేశారని తెలిపారు. ఈ సంఘటనపై ఎ.కోడూరు ఎస్ఐకి, మండల తహశీల్దారుకు ఫిర్యాదు చేశామన్నారు. వెంటనే అధికారులు జోక్యం చేసుకొని, సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు.

విజేత విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపల్ సీతాలక్ష్మి తదితరులు

రాష్ట్ర స్థాయి మార్షల్ ఆర్ట్స్ విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి - పరవాడ : ఈ నెల 15, 16 తేదీలలో రాష్ట్ర వుషు అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో జరిగిన సబ్ జూనియర్, జూనియర్ వుషు ఛాంపియన్ షిప్ పోటీల్లో సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించారు. సబ్ జూనియర్ విభాగంలో యువరాజ్ సింగ్ అండర్ 48 కేజీ- సిల్వర్ మెడల్, నిత్య శ్రీ న్యాకర్ అండర్ 52 కేజీ - బ్రాంజ్ మెడల్, జూనియర్ విభాగంలో షాగున్ పాత్రో అండర్ 48 కేజీ- గోల్డ్ మెడల్, హిమనిషి పార్మర్ అండర్ 45 కేజీ- గోల్డ్ మెడల్, ఆర్చిత పాత్రో 52 కేజీ- సిల్వర్ మెడల్, సాత్విక్ సిధార్థ్ అండర్ 48 కేజీ- బ్రాంజ్ మెడల్ సాధించరని పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి. మధు బాబు తెలిపారు. మంగళవారం నాడు ఈ విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతలక్ష్మి అభినందనలు తెలిపారు. పాఠశాల సీఈఓ కె. నిశంత్, ఫిట్నెస్ కోచ్‌లు మనీష్, బషీర్, రాజేష్, కృష్ణవేణి అభినందించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం పట్టణంలో వైసిపి బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో పట్టణ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గత ఎన్నికల్లో చోడవరం పట్టణంలో వైసిపికి ప్రజలు పట్టం కట్టారని, స్థానిక ఎన్నికల్లో ఎంపీటీసీలు వార్డు సభ్యులు సర్పంచ్ వంటి పదవులు పార్టీకి దక్కాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున ప్రజలకు అందాయని వాటిని వివరించి మరలా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైకాపాకు ఓటు వేసేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ప్రముఖ వైద్యులు బండారు సత్యనారాయణ, చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు న్యాయవాది కాంగ్రేగుల డేవిడ్, వేంపల్లి ఆనందేశ్వరరావు, పట్టణానికి చెందిన ఓరుగంటి నెహ్రూ, దన్నిన వెంకట్రావు, మామిడి నాగేశ్వరరావు, హారిక రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి -కశింకోట : పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ నాయుడు అన్నారు. మండలంలోని ఉగ్గిన పాలెం గ్రామంలో స్వయం సహాయక సంఘాలు సభ్యులు చే పండ్ల మొక్కలు నాటి కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు ద్వారా కాలుష్యం నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎమ్ శ్రీనివాసరావు, సిసి రామకృష్ణ, విఓఏ పద్మావతి, వార్డు సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న సర్పంచ్ గున్నయ్యనాయుడు తదితరులు

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

గొటివాడలో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొటివాడ పంచాయతీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్, ఎంపీపీ బోకం సూర్యకుమారి రాము నాయుడు స్థానిక వైసీపీ నాయకులతో పర్యటించి ఇంటింటికి వెళ్లారు. ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను వివరిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పర్యటించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాలాపు మీనా వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు కర్రి బాబు, ఎంపీడీవో రమేష్ నాయుడు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, ఉపసర్పంచ్ గోళజాన దుర్గా ప్రసాద్, విరోతి రామారావు, బగ్గు ఈశ్వరరావు, పాల్గొన్నారు.

బొజ్జన్న కొండ ఆధునికీకరణ తుది నమూనాల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి

బొజ్జన్న కొండ పర్యటక అభివృద్ధి, ఆధునికీకరణకు రూ.7,32,049 మంజూరు చేసిన నేపథ్యంలో ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం బొజ్జన్న కొండ ఆధునికీకరణ తుది నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతి మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ ప్రాంతం అనకాపల్లి జిల్లాలో ప్రధాన పర్యాటక కేంద్రంగా నిలుస్తుందని తెలియజేశారు. బొజ్జన్న కొండ రహదారి నిమిత్తం ఎంపీ నిధుల ద్వారా మంజూరు చేసిన సుమారు 65 లక్షల రూపాయలతో చేపడుతున్న నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఈ ప్రాంతం యొక్క విశిష్టతను తెలిపే విధంగా తీస్తున్న చిత్రం పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి, ఈఈ వెంకటరమణ, ఇరిగేషన్ ఏఈ హనుమంత్ రావు, ఏలేరు కాలవ డిప్యూటీ ఈఈ వసంత, డిప్యూటీ ఈఈ శ్రీచరణ్, పంచాయతీరాజ్ శాఖ డీఈ వీరన్న నాయుడు, ఏఈ వేణుగోపాల్, ఆర్కియాలజీ శాఖ సిబ్బంది మహోదయ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'జగనన్న తోడు' విడుదల

విశాఖ జిల్లాలో 22,573 మందికి, అనకాపల్లిలో 17,314 మందికి లబ్ధి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

జగనన్న తోడు పథకం ద్వారా 2023 సంవత్సరానికి గాను ఏడవ విడత రుణ సాయం మంగళవారం విడుదల చేశారు. విశాఖపట్నం జిల్లాకు సంబంధించి 22,573 మంది లబ్ధిదారులకు జగనన్న తోడు పథకం కింద రూ. 24.31 కోట్లు రుణ సాయం లబ్ధి చేకూరింది. జిల్లాలో రుణ సాయం సక్రమంగా చెల్లించిన లబ్ధిదారులకు వడ్డీ మాఫీ కింద మొత్తం 18,182 మందికిగాను రూ.43.32 లక్షలు జమ చేయడం జరిగింది. ఈ సందర్భంగా విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున మాట్లాడుతూ జగనన్న తోడు పథకం కింద అర్హత కలిగిన చిరు వ్యాపారులకు రూ.10 వేలు రుణం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి, గాజువాక ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, జివియంసి కమిషనర్ సియం సాయికాంత్ వర్మ, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, డిఆర్డీఏ పి.డి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందిస్తున్న అనకాపల్లి ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి తదితరులు

అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో 17,314 మందికి 18.64 కోట్ల రూపాయలు జగనన్న తోడు ఆర్థికసాయం విడుదల అయినట్టు ఎంపీ డాక్టర్ సత్యవతి, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్, కలెక్టర్ రవి పటాన్ శెట్టి తెలిపారు. ఈ మేరకు జగనన్న తోడు చెక్కును మంగళవారం కలెక్టరేట్లో విడుదల చేశారు. వడ్డీ రాయితీ కింద అనకాపల్లి జిల్లాలో 6,998 మందికి రూ.16.64 లక్షలు లబ్దిదారుల అకౌంట్ల జమచేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బి. వరాహసత్యవతి, డిఆర్డీఏ పిడి లక్ష్మీపతి, మెప్మ పీడి సరోజినీ, శంకరం సర్పంచ్ మొల్లి లక్ష్మి రామకష్ణ, లబ్దిదారులు పాల్గొన్నారు.

31న కలెక్టరేట్ వద్ద ధర్నాకు తరలిరండి

ఎండిఎం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి

ప్రజాశక్తి- అనకాపల్లి

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 31న కలెక్టర్ కార్యాలయం దగ్గర జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి వరలక్ష్మి పిలుపునిచ్చారు. అనకాపల్లి సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో వరలక్ష్మి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులపై పనిభారంతో పాటు, వేధింపులు ఎక్కువ అవుతున్నాయన్నారు. పాఠశాలల విలీనం పేరుతో వందలాది మంది కార్మికుల ఉపాధి తొలగించి రోడ్డున పడిసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పని భద్రత కల్పించాలని, వంటకు ఉపయోగించే వంట పాత్రలు సరఫరా చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు జరపాలని, 10 నెలలకు కాకుండా 12 వేతనాలు ఇవ్వాలని తదితర సమస్యల పరిష్కారం కోసం జరుగు ధర్నా చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షరాలు కె.ప్రసన్న, అమ్మాజీ, ఉమ, శ్రీదేవీ, లక్ష్మి, షేక్ బీబి, సత్యవేణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి - అనకాపల్లి

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం తేవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో అనకాపల్లి జిల్లా ముఠా కార్మిక సంఘం సమావేశం ఆర్ రాము అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా కోటేశ్వరరావు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులు మండల కేంద్రాలు, ప్రభుత్వ సివిల్ సప్లై గోడౌన్, బేవరజెస్ కార్పొరేషన్, వ్యాపార సముదాయాలలో పని చేస్తున్నారని, వీరికి ఎటువంటి సమగ్ర చట్టం లేదని, వయసు మళ్లిన తర్వాత ఎటువంటి ఆదరణ లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సరుకులు లోడింగ్ అన్లోడింగ్ చేస్తూ వ్యాపారానికి తోడ్పాటు నందిస్తున్నారని, ఈ సమయంలో ప్రమాదాలు జరిగితే వీరిని ఆదుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ రాష్ట్రంలో ముఠా కార్మికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి సమగ్ర చట్టం, కనీస వేతనం అమలు చేస్తున్నారని, అయితే మన రాష్ట్రంలో మాత్రం ఎటువంటి చట్టం అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. అటువంటి చట్టాలు లేకపోవడం వల్ల కార్మికుల జీవనం దుర్భరంగా మారుతుందని పేర్కొన్నారు. ముఠా కార్మికులకు భద్రత కల్పించాలని, 60 ఏళ్ల దాటిన వారికి పెన్షన్, గ్రాట్యుటీ, పిఎఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్ లాంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజన్న, సత్తిబాబు, బర్ల రమణ, కాపుశెట్టి అప్పారావు, నానాజీ, రాజు, అప్పారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

సర్టిఫికెట్లు అందిస్తున్న యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు

గ్రామాల్లో జగనన్న సురక్ష

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీ గ్రామ సచివాలయం-1, 2ల వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్, ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, జడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, బూసి అప్పలరాజు, వైసిపి నాయకులు కోటాన రాము, కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, తహసీల్దార్ కనకరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : జగనన్న సురక్ష కార్యక్రమం ఆవ సోమవారం, మడుతూరు గ్రామాలలో సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నబాబు రాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 11 రకాల సర్టిఫికెట్లను మంజూరు చేసి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ యు సుకుమార వర్మ, జడ్పిటిసి లాలం రాంబాబు, నర్మాల కుమార్, దేశం శెట్టి శంకర్రావు, ఎంపీడీవో విజయలక్ష్మి డిఈ వీరభద్రరావు పాల్గొన్నారు.

పశువులకు వైద్యం చేస్తున్న పశు సంవర్ధకశాఖ అధికారులు

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : యలమంచిలి మున్సిపాలిటీ పెద్దపల్లిలో రిలయన్స్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో పోతల సూరిబాబు ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. 25 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి, ఖనిజ లవణ మిశ్రమాన్ని, మందులను పాడి రైతులకు ఉచితంగా అందించారు. పెయ్యి దూడల ఉత్పత్తి పథకం ద్వారా నాలుగు నెలల క్రితం చూడు పరీక్షలు నిర్వహించి 26 పశువులకు సెక్స్ సార్టెడ్ సిమెన్ (లింగ నిర్ధారిత వీర్యం) చేయించిన వాటిని ప్రదర్శించారు. వాటిలో 14 పశువులు చూడు కట్టడంతో వాటికి వెయ్యి రూపాయలు విలువ చేసే 6 కేజీల ఖనిజలవణ మిశ్రమాన్ని ఉచితంగా పాడి రైతులకు అందించి, పశువులకు పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ద్వారా పేడ పరీక్షలు నిర్వహించారు. జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఇఒ రామ్మోహనరావు, పశువైద్యాధికారి ఎల్.కె. సుధాకర్, జిల్లా పశు సంవర్ధక శాఖ డిఎహెచ్ఓ ప్రసాదరావు, స్థానిక కౌన్సిలర్లు దుంగ అచ్యుతరావు, దాసరి చిన్నమ్ములుకుమార్, కోడిగుడ్ల రమణబాబు, గొర్లి వెంకట్, డాక్టర్ జె.పద్మజ పాల్గొన్నారు.

రాజకీయ పక్షాలతో సమావేశం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : ఓటర్ల జాబితాల పరిశీలనలో బిఎల్ఓలు పారదర్శకంగా వ్యవహరించాలని చోడవరం నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి ప్రమీల గాంధీ సూచించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పక్షాల ప్రతినిధులు, బిఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రలోభాలకు గురి కాకుండా ఓటర్ల జాబితాలను పరిశీలన చేపట్టాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ నుండి గోకివాడ కోటేశ్వరరావు, సిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, వైసిపి నుండి సుంకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రమీల గాంధీ

తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్ఏలు

వీఆర్ఏల సమస్యలపై తహశీల్దారుకు వినతి

ప్రజాశక్తి- దేవరాపల్లి

వీఆర్ఏల డిమాండ్లను పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల కమిటీ నాయకులు మంగళవారం స్థానిక తహశీల్దారు ఎం.లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. గత కొంతకాలంగా తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా వాటిని నెరవేర్చకపోవడంతో ఈ నెల 20 నుంచి దశల వారీగా ఆందోళన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని మండల వీఆర్ఏల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం. బొజ్జులు, ఈశ్వరరావు శ్రీను తెలిపారు. ఇప్పటికే అర్హత ఉన్నప్పటికీ నేటికీ వీఆర్ఏలుగా కొనసాగుతున్నారని చెప్పారు. ఈ నెల 20, 21 తేదీలలో మండల తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన దీక్షలు, ఆగస్టు 6, 7 తేదీలలో జిల్లా కలెక్టరేట్ వద్ద దీక్షలు, ఆగస్టు 23, 24 తేదీలలో విజయవాడ కేంద్రంగా రాష్ట్రస్థాయిలో దీక్షలు, ఆగస్టు 25వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, ఈశ్వరరావు, వివిధ గ్రామాల వీఆర్ఏలు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో మంగళవారం బాధ్యతా వితరణ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్ఐ సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎంపిక చేసిన విద్యార్థులకు బ్యాడ్జీలు ఇచ్చి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీష్, జోనల్ ఇంఛార్జి వెంకటేష్, జీఎం రమ్య, ఎజీఎం మూర్తి, డిఐ గోవింద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

21న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-చోడవరం : ఈనెల 21వ తేదీన చోడవరం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో జరగబోయే విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు పిలుపునిచ్చారు. తాము ఎదుర్కొంటున్న లోవోల్టేజీ, హై వోల్టేజీ, ఇతర కరెంటు సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. పెండింగ్లో ఉన్న అదనపు విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు.

సమస్యలపై విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్ఓ వెంకటరమణకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకుండా ఈ విద్యా సంవత్సరం నుంచి 4 సంవత్సరాల డిగ్రీ విద్యను ప్రవేశ పెట్టిందని, దీనివల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థులు వారు చదివే సబ్జెక్టులు లేక విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచి మౌలిక సదుపాయాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి గాంధీనగరంలో ఉన్న ఎస్సీ, బీసీ హాస్టల్లో విద్యార్థులు హాస్టల్ భవనాలు శిథిలావస్థలో ఉండడం వల్ల ఎప్పుడు ఏమవుతుందోనని భయంతో ఉంటున్నారని, వీటికి మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రాజు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సతీష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ, రమేష్, అరుణ్, శిరీష, రోషిని, చైతన్య విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

వి.వి.రమణ వర్ధంతి

ప్రజాశక్తి-అనకాపల్లి : రైతు బాంధవుడు, రాజ్యసభ మాజీ సభ్యులు వి.వి.రమణ 45వ వర్ధంతి కార్యక్రమం వివి రమణ రైతుభారతిలో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ ఛైర్మన్ మళ్ల సాంబశివరావు మాట్లాడుతూ గవరలను బిసి డిక్ తీసుకొచ్చిన ఘనత రమణదేనని పేర్కొన్నారు. అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం ఉపాధ్యక్షులు విల్లూరి పైడారావు మాట్లాడుతూ వివి రమణ మరణించి 45 సంవత్సరాలైనా ఇంకా ప్రజల గుండెల్లో నిలిచిపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విల్లూరి లక్ష్మణరావు, విల్లూరి రాము నాయుడు, విల్లూరి రామచంద్రరావు, విల్లూరి శివసూర్యనారాయణ, నానాజీ, కర్రి దివాకర్ రావు, విల్లూరి రాము, భీశెట్టి కృష్ణ అప్పారావు, వెల్లూరి రెడ్డమ్మ నాయుడు, విల్లూరి జగ్గబాబు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన రావాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజలందరూ చంద్రబాబు నాయుడు పాలన కోరుకుంటున్నారని, 2024 ఎన్నికల గెలుపే ధ్యేయంగా టిడిపి శ్రేణులు పనిచేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. స్థానిక మల్లవీధిలో మంగళవారం కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో 83వ వార్డు ఇంచార్జీ బొద్దపు ప్రసాద్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్ , పొలిమేర ఆనంద్, యాంద్ర రామకృష్ణ, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సింహ గర్జన బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కె.కోటపాడు : బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ఈనెల 23న విజయవాడలో జరిగేబోయే బహిరంగ సభకు అందరూ తరలి రావాలని అనకాపల్లి జిల్లా మీడియా ఇంఛార్జి యలమంచిలి ధర్మారావు పిలుపునిచ్చారు. మండల యాదవ సంఘం అధ్యక్షుడు నబారు అప్పారావు ఆధ్వర్యంలో గోడ పత్రిక ఆవిష్కరణ జరిగింది. కొత్త తరానికి వారధిగా, భావితరాలకు రథసారథిగా నిలవనున్న బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న బీసీల పార్టీగా అవతరించిన కొత్త పార్టీ ఆవిష్కరణకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల పరిశీలన

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని మూలపేట గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మంగళవారం సర్పంచ్ బీశెట్టి గంగప్పల నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాలుగా గ్రామంలో డ్రైనేజీలు పూడుకుపోవటం తద్వారా మురుగునీరు స్తంభించడంతో గ్రామస్తుల ఇబ్బందులను గమనించి శాశ్వత మరమ్మతులు చేపట్టడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఆడారి సత్యనారాయణ, మొల్లేటి గోవిందరావు, కాండ్రేగుల వరలక్ష్మి, శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు కాండ్రేగుల ఈశ్వర అప్పారావు, బీసెట్టి పైడికొండ, మొల్లేటి సంజీవరావు పాల్గొన్నారు.

నగదు బహుమతుల అందజేత

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట బాలుర హైస్కూల్లో పదో తరగతి పూర్తి చేసి ట్రిపుల్ ఐటీ ఎంపికైన నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1116 చొప్పున నగదు బహుమతులు మంగళవారం అందజేశారు. ఈ మొత్తాన్ని సమకూర్చిన గుళ్లిపల్లి వెంకటేశ్వర్లు, సుంకర మూర్తి, వారి చేతులు మీదుగా విద్యార్థులు మెహ్రజ్, బిందు, రాకేష్, కౌశిక్ లకు అందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ఎమ్ఆర్వి అప్పారావు, సహ ఉపాధ్యాయులు ప్రభాకర్రావు, నాగేశ్వరరావు, అప్పారావు, శర్మ, సూర్యారావు, ఆనంద్ పాల్గొన్నారు.

HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATHI
MACMA No. 2025 of 2015
Between:
The Oriental Insurance Company Limited, Rep. by its Branch Manager Visakhapatnam ...Appellant
And
Gorle Manga and another ...Respondents
To
Respondent No.1:
Gorle Manga, D/o. Ramunaidu, Aged 07 years, P. Dharmavaram, Visakhapatnam District. (Being minor rep. by her father and guardian Ramunaidu, S/o. Appanna, Hindu, 48 years, Occ: Business, R/o. P. Dharmavaram)
Respondent No.2:
Sri G.Ramesh, S/o.Ramachandran, Hindu, R/o.D.No.27-18-84, Congress Office Road, Vijayawada.
Please take notice that the Appellant has filed the above appeal before the Hon'ble High Court of Andhra Pradesh at Amaravathi against you and another challenging the order and decree dated 06-11-2006 in MOP No.764 of 2001 on the file of the IX Additional District Judge-cum-Motor Vehicles Accident Tribunal (Fast Track Court), Visakhapatnam and the said appeal is posted to **07-08-2023** for your appearance **before the Hon'ble High Court of Andhra Pradesh at Amaravathi** at **10.30 A.M.** personally or through your counsel failing which, the matter will be decided as per law.
(By Order of the Hon'ble High Court of Andhra Pradesh at Amaravathi)
A. JAYANTHI & G. SATYA PRASAD
Advocates
A-505, 'ELITE LX Apartments' Block-A, D.No.52-3-2A/4, Road No.3, NTR Colony Behind St. John's School, Gunadala, VIJAYAWADA-520 008
Cell: 99496 35252, 98661 91261

అల్లుకున్న నిర్లక్ష్యం

విద్యుత్ వైర్లకు పూర్తిగా అల్లుకున్న తుప్పతీగలు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల కేంద్రంలో సీతారామరాజు నగర్ శ్రీ విద్యాన్ స్కూలు సమీపంలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తుప్పతీగలతో సమీప ప్రాంత వాసులు ఆందోళన చెందు తున్నారు. నిత్యం వివిధ పనులపై వెళ్లే ప్రజలు, విద్యార్థులు తిరుగు తున్న ప్రదేశంలో విద్యుత్ స్తంభానికి ప్రమాద కరంగా తీగలు అల్లుకున్నా వాటిని విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. కొన్ని సందర్భాల్లో పైనుంచి నిప్పులు రాలుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి స్తంభానికి అల్లుకున్న తీగలను తొలగించాలని కోరుకుంటున్నారు.

కాలువలపై ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-కొత్తకోట : రావికమతం మండలంలో కొత్తకోట పంచాయతీ పరిధిలో కాలువలపై వున్న ఆక్రమణలు తొలగింపునకు పంచాయితీ అధికారులు శ్రీకారం చుట్టారు. మంగళవారం నందీశ్వర ఆలయం (తొడపెద్దు) నుంచి గుమ్ముడువీది రామాలయం మీదుగా కాపులదిబ్బ వరకు కాలువలపై వున్న ఆక్రమణలు తొలగించారు. కాలువలపై ఆక్రమణలు ఉండటంతో వర్షం వస్తే నీరంతా రోడ్డు పైకి చేరి, గ్రామస్తులు రాకపోకలకు పలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని వైసీపీ నాయకులు శీలం శంకరరావు పంచాయతీ పాలక వర్గం దృష్టికి తీసుకువెళ్లడంతో సర్పంచ్ కొన లోవరాజు, వార్డు మెంబర్లు గుమ్ముడు రమేష్, గుమ్ముడు దొరబాబు పర్యవేక్షణలో ప్రొక్లెయినర్‌తో ఆక్రమణలు తొలగిస్తున్నట్లు వెల్లడించారు.

రహదారి నిర్మాణంపై హర్షం

ఎంపిపిని సత్కరిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

ప్రజాశక్తి-మాడుగుల :స్థానిక అగ్నిమాపక కేంద్రానికి సిసి రహదారి నిర్మించడం పట్ల ఆ శాఖ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సిసి రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎంపిపి పెదబాబుకు మంగళవారం సన్మానం చేశారు.కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు బొమ్మి శెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు

క్రికెట్ కిట్ పంపిణీ

ప్రజాశక్తి- మాడుగుల: మండలంలోని ఎల్ పొన్నవోలు పంచాయతీకి చెందిన యువకులకు జనసేన నేత రాయపురెడ్డి కృష్ణ మంగళవారం క్రికెట్ కిట్ పంపిణీ చేశారు పలు గ్రామాలలో యువకులకు క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న ఆయన, మంగళవారం పొన్నవోలు యువతకు కిట్ అందజేసి మాట్లాడుతూ, యువకులు క్రీడలు పట్ల ఆసక్తి పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కలిమిశెట్టి గణేష్ పాల్గొన్నారు

క్రికెట్ కిట్ అందిస్తున్న కృష్ణ

నత్తనడకన నిర్మాణాలు

◆ ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు పూర్తి చేయడంలో నిలువెత్తు నిర్లక్ష్యం

◆ నాలుగున్నరేళ్లు కావస్తున్నా ఇంకా వీడని బాలారిష్టాలు

శ్లాబ్ పూర్తయి దిష్టిబొమ్మలా సచివాలయ భవనం

ప్రజాశక్తి కోటవురట్ల: మండలంలో చిన్న బొడ్డేపల్లి గ్రామంలో నిర్మిస్తున్న సచివాలయ, రైతుభరోసా, హెల్త్ సెంటర్ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నరేళ్లు పూర్తికావస్తున్నా, నేటికీ నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో అటు సిబ్బంది, రైతులు, గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు, సచివాలయ పరిధిలో ఆక్సాహేబ్ పేట గ్రామంతో పాటు సమీపంలో 15 వరకు శివారు గ్రామాలు ఉన్నాయి.

గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో హెల్త్ సెంటర్ నిర్మాణాలు మొదలుపెట్టి ఏళ్ల గడుస్తున్నా ఏ ఒక్క భవనం నేటికి పూర్తికాక పోవడం విశేషం, సచివాలయ భవనానికి శ్లాబ్ వేసి ఏడాదిన్నర గడిచినా తదుపరి పనులు చేపట్టలేదు. రైతు భరోసా కేంద్రం పిల్లర్ల స్థాయిలో ఉంది. ఇక హెల్త్ సెంటర్ పునాదిస్థాయిని దాటి ముందుకు పోలేదు. దీంతో సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది పాత పంచాయతీ భవనంలోనే విధులు నిర్వహిస్తూ అవస్థలు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి భవన నిర్మాణాలు వేగవంతం చేసి, పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

పిల్లర్ల దశలోనే రైతు భరోసా కేంద్ర భవనం

పునాదుల స్థాయిని దాటని హెల్త్ వెల్నెస్ సెంటర్

స్వయంసహాయక సంఘాలకు మొక్కలు

ప్రజాశక్తి -కొత్తకోట : గ్రీన్ మిలీనియం కార్యక్రమంలో భాగంగా కొత్తకోట గ్రామంలో పలు స్వయం సహాయక సంఘాల సభ్యులకు 650 పండ్ల మొక్కలను మంగళవారం పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్, గ్రామ సర్పంచ్ కోన లోవరాజు వీటిని మహిళలకు అందజేశారు. అనకాపల్లి జిల్లాలో ఫలసాయాలన్నిచ్చే లక్ష మొక్కలను నాటే కార్యక్రమంలో భాగంగా రావికమతం మండలానికి ఐదు వేల మొక్కలు కేటాయించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లోవరాజు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతతోపాటు భవిష్యత్తులో ఫలసాయంతో స్వయంశక్తి మహిళలకు లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో వీటిని అందజేస్తున్నామన్నారు.

మొక్కలు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

మొక్కలునాటి సంరక్షించి, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ మళ్ల చిరంజీవి మండలమహిళా సమాఖ్య ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు..

మాజీ ఎమ్మెల్యే ఎంవివికి ఘననివాళి

ఎంవివి విగ్రహానికి నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని సిహెచ్.నాగాపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఎంవివి. సత్యనారాయణ 16వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, సేనాపతి సత్తిబాబు, టిడిపి నాయకులు కార్యకర్తలు ఎంవివి.విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రామారావు మాట్లాడుతూ గ్రామానికి బ్రిడ్జి ఏర్పాటులో ఎంవివి కృషి మరువలేమన్నారు. గ్రామంలో సిసి రోడ్లు, వాటర్ ట్యాంకు కూడా ఎంవివి హయాంలో, ఆయన సహకారంతో నిర్మించారని, భౌతికంగా దూరమైనా, ఎంవివి జ్ఞాపకాలు మరువలేమన్నారు. పార్టీ సీనియర్ నాయకులు బొప్పన ప్రసాద్ మాట్లాడుతూ ఎంవివి తమ గ్రామానికి చేసిన అభివృద్ధిని గుర్తుచేసుకుంటూ ఏటా ఆయన వర్ధంతిని నిర్వహిస్తున్నామన్నారు. టిడిపి హయాంలోనే తమ గ్రామంఅభివృద్ధి చెందిందని, రాబోయే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు.కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు కలం నాగేశ్వరరావు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

హైవే జంక్షన్‌లో విద్యుద్దీపాల ఏర్పాటు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఉద్దండపురం హైవే జంక్షన్‌వద్ద విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ శిరీష తెలిపారు.ప్రమాదాల నివారణకు హైవే జంక్షన్ వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులకు ఎస్‌పి సూచించారని, ఈ మేరకు హైవే అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

వీధిదీపాలు ఏర్పాటు చేస్తున్న విద్యుత్

గ్రామకంఠం కబ్జాపై చర్యలేవీ?

ప్రజాశక్తి- పాయకరావుపేట : ఆక్రమణకు గురైన పంచాయతీ గ్రామకంఠం భూమిని తక్షణమే స్వాధీనం చేసుకుని అంబేద్కర్ సామాజిక భవనం నిర్మించాలని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపకులు, హైకోర్టు న్యాయవాది వడ్డమూరి కృష్ణ స్వరూప్ కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, దీనిపై ఆర్‌డిఒ, తహశీల్దార్, ఇఓపిఆర్‌డిలకు పార్టీ జిల్లా అధ్యక్షులు దువ్వాడ చంటిబాబు ఫిర్యాదు చేశారన్నారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో తగు చర్యలు కోసం కర్నూల్ లోని రాష్ట్ర లోకాయుక్త కోర్టుకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని లోకాయుక్త కోర్టు నుంచి కలెక్టర్, ఇఓపిఆర్‌డిలకు రెండుసార్లు ఆదేశాలొచ్చినా అధికారుల స్పందన లేదన్నారు. అక్రమంగా పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించికొని గ్రామ రెవిన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకున్నారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్ లోతైన విచారణ జరిపి, లోకాయుక్తకు తగు సమాచారం ఇవ్వడంతోపాటు ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి విముక్తి చేసి కాపాడాలని కోరారు. లేకుంటే పోరాటం ద్వారా దళిత బహుజనులు స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

భారీగా ఒడిశా మద్యం పట్టివేత

- సర్పంచ్ సహా ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి-మాడుగుల : ఒడిశా నుంచి అక్రమంగా మద్యం దిగుమతి చేసి అమ్మకాలు సాగించేందుకు ప్రయత్నించిన ఒక ముఠాను ఎస్ఐ దామోదరనాయుడు అతని సిబ్బంది సోమవారం పట్టుకున్నాడు. గాదిరాయి గ్రామంలో ఒక పాకలో నిల్వ చేసిన 10,639 క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఒ మ్మలి సర్పంచ్ సుంకర సింహాచలంనాయుడుతో పాటు, పడాల నాగేశ్వరరావు, సేనాపతి సత్యం అప్పారావు, పడాల మహాలక్ష్మి నాయుడు, తాసుబిల్లి కోదండ, మొల్లి శ్రీనులను అరెస్ట్ చేశారు. ఒడిశాలో రూ.9 లక్షల 10 వేలకు మద్యం కొనుగోలు చేసి, స్థానికంగా రూ.15 లక్షలకు మద్యం అమ్మకాలు సాగించే పథకం ముఠా వేయడంతో వీరి గుట్టురట్టు అయ్యింది.

బాల్యం నుంచే నాయకత్వ లక్షణాలు అవసరం

రవీంద్రభారతి విద్యార్థులతో ఎస్ఐ ధనుంజయనాయుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : బాల్యం నుండే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని టౌన్ ఎస్ఐ ధనుంజయనాయుడు అన్నారు. మంగళవారం శారదానగర్ రవీంద్రభారతి పాఠశాలలో బాధ్యతల వితరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ బాలబాలికలు క్రమశిక్షణ అలవర్చుకొని, మంచి విద్యార్థులుగా, భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దాన్ని సాధించేందుకు పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులనూ పెద్దలనూ ఉపాధ్యాయులను తోటి విద్యార్థులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో జనరల్ ఇన్‌చార్జి ఎన్. వెంకటేష్, జి.ఎమ్. రమ్య, ఎడిఎం మధు, డిఐ సిహెచ్ గోవింద, ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు. హౌస్ కెప్టెన్లకు జోనల్ ఇన్‌ఛార్జి వెంకటేష్ పతకాలు అందజేశారు.

పాదయాత్రకు అనుమతించాలని వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి : హెటిరో కొత్త పైపులైన్ సమస్యను అనకాపల్లి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు పాదయాత్రకు అనుమతి ఇప్పించాలని మత్స్యకారులు కోరారు. మంగళవారం సిఐ నారాయణరావు, డిటి నీరజలకు పాదయాత్రకు అనుమతి కోరుతూ వినతిపత్రం అందజేశారు. తాము 588 రోజులుగా ధర్నా చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం స్పందించడం లేదని, ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డ తాము కలెక్టర్‌ను కలిసి స్పందనలో విన్నవించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సుమారు రెండు వందల మందితో ఈనెల 30న నక్కపల్లిలో బయలుదేరి, 31న అనకాపల్లి కలెక్టరేట్‌కు పాదయాత్రగా చేరుకుని, స్పందనలో ఫిర్యాదుకు అనుమతించాలని కోరారు. మత్స్యకారులు పిక్కి స్వామి, గోసల స్వామి, పిక్కి తాతీలు, చేపల సోమేష్, పిక్కి కోటి, మైలపల్లి కాశీరావు ఉన్నారు .

అణుకు సమస్యలపై ఇంత నిర్లక్ష్యమా?

- ◆ సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం
- ◆ ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం
- ◆ గిరిజనుల ఆందోళనకు సంఘీభావం

ప్రజాశక్తి-కోటవురట్ల : రోడ్డు, పాఠశాల ఏర్పాటు చేయాలంటూ న్యాయమైన డిమాండ్‌తో 12రోజులుగా ఆందోళన చేస్తున్న అణుకు గిరిజన గ్రామ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. అణుకు గిరిజనుల సమస్యలపై ప్రభుత్వం దిగివచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేవరకు దీక్ష విరమించేది లేదని, వారి పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. మంగళవారం అణుకు గిరిజన గ్రామస్తులు చేస్తున్న రిలే దీక్ష శిబిరాన్ని స్థానిక సిపిఎం నాయకులతో కలిసి సందర్శించి, గిరిజనుల న్యాయపోరాటానికి సంఘీభావం తెలిపారు. అనంతరం అణుకు గ్రామాన్ని సందర్శించారు వారి సమస్యలను

కాలినడకన అణుకు వెళుతున్న సిపిఎం బృందం

రిలే దీక్ష శిబిరంలో పాల్గొన్న లోకనాథం, సిపిఎం నేతలు

నిశితంగా పరిశీలించి, అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రధానంగా రహదారి లేకపోవడంతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదు సరికదా, అత్యవసర వైద్యానికి గిరిజనులు ఇ బ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు గొట్టువాడ కేంద్రానికి కాలినడకన వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు, నేటికీ గ్రామానికి సక్రమంగా రేషన్ బియ్యం బండి రావడం లేదని, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న అణుకు గిరిజనులకు అందరికీ అంత్యోదయ కార్డు అందజేయాలని, ప్రతి ఒక్కరికి పోడు భూమి కనీసం ఐదు ఎకరాలు పట్టా అందజేయాలని డిమాండ్ చేశారు, గ్రామస్తులకు పక్కా ఇల్లు నిర్మాణం చేపట్టాలని, తాగునీటి ట్యాంకు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజు, ఎం. సత్యనారాయణ, డేవిడ్ రాజు, బి నాగేశ్వరరావు, ఎం సూరిబాబు, జి సన్యాసిరావు, టి రాజబాబు, నవీను రాజబాబు, గోవిందు పాల్గొన్నారు.

గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్న లోకనాథం

న్యాయం జరిగే వరకు పోరాటం

ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, జెఎసి నేతలు

ప్రజాశక్తి- నక్కపల్లి : తమకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగించాలని మత్స్యకార జెఎసి నేతలు స్పష్టం చేశారు. హెటిరో కంపెనీ రెండవ పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా మంగళవారం నాటికి 588వ రోజుకు చేరింది. శిబిరం వద్ద మత్స్యకారులు పైప్ లైన్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. పైపులైనుకు వ్యతిరేకంగా ఏడాదిన్నరకు పైగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వంగాని, అధికార యంత్రాంగం గానీ స్పందించకపోవడం దుర్మార్గమని, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టలేదన్నారు. మత్స్యకారుల సమస్యపై ఇంత నిర్లక్ష్యం చూపుతున్న ప్రభుత్వం, అధికారులకు బుద్ధి చెబుతామన్నారు. కొత్త పైప్‌లైన్ ఏర్పాటును ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకొని తీరుతామని స్పష్టం చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో మత్స్యకారులు గోసల స్వామి, చేపల సోమేష్, కోడ కాశీ, పిక్కి గంగరాజు, ఏపి మత్స్యకార జెఎసి రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పిక్కి స్వామి, వాసపల్లి దేవుడు, పిక్కి సత్తిరాజు, బొంది గురయ్య, పిక్కి కోటి, కారె రాజారావు, జగ్గ పాల్గొన్నారు

జోరువానలోనూ గడపగడపకూ...

సంక్షేమ పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీలోని తొమ్మిదవ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మంగళవారం నిర్వహించారు. వార్డు వైసిపి ఇన్‌ఛార్జి ఎల్లేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జోరు వానలోనూ ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గడపగడపలో ఎమ్మెల్యేకు మంగళహారతులతో మహిళలు స్వాగతం పలికారు. బైకు ప్రమాదంలో కాలు కోల్పోయి, చికిత్స పొందుతున్న పైడిగంటం వెంకట రవిచంద్రను ఎమ్మెల్యే పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఇప్పటికే తమ కుమారుని వైద్యానికి దాదాపు రూ.30 లక్షలు ఖర్చు చేశామని రవిచంద్ర కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సాధ్యమైనంత ఎక్కువ ఆర్థిక సహాయం అందించే ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే ఆ కుటుంబానికి హామీ ఇచ్చారు. వార్డులో మూడు సిసి రోడ్లు, శ్మశానానికి కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలని ప్రజల కోరగా, త్వరలోనే తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షుడు యాకా శివ, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, సిరసపల్లి నాని, కార్పొరేషన్ డైరెక్టర్లు చోటీ, కర్రి శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు లగుడు అయ్యప్పస్వామి, షేక్ రోజా, కిల్లాడ లోవ, మహిళా నాయకులు లోకారపు శ్రీశరద, దేవత అరుణ, కొంతాల వరలక్ష్మి, మున్సిపల్ అధికారులు, పట్టణ ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం

ప్రజాశక్తి-గొలుగొండ :మండలంలోని కృష్ణదేవిపేట గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్‌కు అంతరాయం కలగడంతో సెల్‌సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బిఎస్ఎన్ఎల్ సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సిగ్నల్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రైల్వే అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గుణుపూర్-నౌపడ-విజయనగరం-రాయగడ రైల్వే లైన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి మంగళవారం పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. వర్షాకాలం నేపథ్యంలో భద్రతా అంశాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత విజయనగరం-రాయగడ సెక్షన్‌లో విండో ట్రైలింగ్ తనిఖీలలో భాగంగా బొబ్బిలి, పార్వతీపురం స్టేషన్లను పరిశీలించారు. ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం రాయగడ స్టేషన్‌ను పరిశీలించారు. అక్కడి రైల్వే కాలనీలో పునరుద్ధరించిన చిల్డ్రన్ పార్కును ప్రారంభించారు. రాయగడ నాగరిక మంచ్ సభ్యులు, మీడియా ప్రతినిధులు ఆయనతో ముచ్చటించారు. అనంతరం గుణుపూర్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆంధ్ర-ఒడిశా రైల్ యూజర్స్ అసోసియేషన్ కన్వీనర్ జిఎన్ పాండాతో భేటీ అయ్యారు. పర్లాకిమిడి

పనులను పరిశీలిస్తున్న డిఆర్ఎం అనూప్ సత్పతి

స్టేషన్‌కు వెళ్లగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి డిఆర్ఎంను కలిశారు. చివరిగా విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులతో డిఆర్ఎం ఆ ప్రాంతంలో జరుగుతున్న పనులపై చర్చించారు.

వంద అడుగుల విస్తరణకే మొగ్గు

కోర్టును ఆశ్రయించిన కొందరు నిర్వాసితులు

నేటి కోర్టు తీర్పుపైనే సర్వత్రా ఆసక్తి

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణపై పంచాయతీలు కొనసాగుతూనే ఉన్నాయి. నర్సీపట్నం డివిజన్ ప్రాంతంలో ప్రజల అభీష్టం, ట్రాఫిక్ ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని 100 అడుగుల విస్తరణ చేపట్టాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, అధికారులు కృతనిశ్చయంతో ఉన్నారు. దీనిలో భాగంగానే స్థానిక మున్సిపల్ అధికారులు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. కాగా ఇప్పటికే సుమారు 170 మంది షాపు భవన యజమానులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈ రోజు 19న కోర్టు నుండి వచ్చే తీర్పు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. భూసేకరణ చట్టం ప్రకారం స్థలాలను సేకరించి, చట్టపరంగా నష్టపరిహారాన్ని అందించి పనులు చేపట్టాలని అధికారులు చూస్తున్నారు. ప్రజాప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని, రోడ్డు విస్తరణలో ముందుకు సాగాలని అధికార పార్టీ ఎమ్మెల్యేతోపాటు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అయితే దుకాణాలు, భవనాలను కోల్పోతున్న నిర్వాసితులకు మాత్రం రోడ్డు విస్తరణకు తాము వ్యతిరేకం కాదని, అయితే విస్తరణ నిడివిని వంద అడుగులకు కాకుండా తగ్గించాలని, తద్వారా తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. దీనిపై కోర్టులో వివాదంఉన్న నేపథ్యంలో కోర్టు తీర్పువైపు అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఘనంగా బిఒబి వ్యవస్థాపక దినోత్సవం

రక్తదానం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 20న జరిగే బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగానే విశాఖ రీజియన్‌లో సంబరాలు, సేవా కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా బ్యాంకు రీజినల్ ఆఫీసులో మంగళవారం ఎఎస్.రాజా బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో 45 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని బ్యాంకు రీజనల్ మేనేజర్ పిఎం.పఠాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ రీజియన్ పరిధిలోని అన్ని బ్రాంచీలలో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 20న ఉదయం విశాఖలోని ఆర్కె బీచ్ నందులో తీర ప్రాంత శుభ్రత కార్యక్రమం చేపట్టనున్నట్టు వెల్లడించారు.

పిఆర్‌టియు నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండల పిఆర్‌టియు మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నికలు కొత్తకోట మండల పరిషత్ప్రాథమిక పాఠశాల (పెద్దబడి)లో మంగళవారం జరిగాయి.సంఘం రాష్ట్ర కార్యదర్శి జిపిఎస్ నాయుడు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మండల శాఖ నూతన అధ్యక్షుడిగా అంగజాల వీరప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా వేములపూడి రాజశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతిరావు, సత్యనారాయణ, వి ఫణీంద్ర పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో నాలుగు స్వర్ణ పతకాలు, రెండు రజతాలు గెలుచుకున్న మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులను టౌన్ సిఐ నమ్మి గణేష్ మంగళవారం అభినందించారు. ఏపి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఈ నెల 16న, పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో నాలుగు స్వర్ణ పతకాలు, రెండు రజత పతకాలు సాధించారని స్థానిక మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు తెలిపారు. పతకాలు సాధించిన వారిలో ఆర్. హేమంతి, ఒక స్వర్ణం, ఒక రజత పతకం సాధించగా, ఎకె. మనోజ్ కుమార్, వై అనన్య, జి లిఖిత్‌రామ్ స్వర్ణ పతకాలను సాధించారన్నారు. ఈ సందర్భంగా సిఐ గణేష్ మార్షల్ ఆర్ట్స్ విజేతలను అభినందిస్తూ పిల్లలకు చిన్నప్పుడే కరాటే వంటి శిక్షణ ఇవ్వడం వలన ఆత్మరక్షణ కలుగుతుందన్నారు. క్రీడల్లో నైపుణ్యత సాధించడం ద్వారా పేరు ఖ్యాతితోపాటు ఉద్యోగం, మంచి భవిష్యత్‌లో స్థిరపడేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఇకార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ కోచ్ ప్రసాద్(చిన్ని) పాల్గొన్నారు..

విద్యార్థులను అభినందిస్తున్న సిఐ గణేష్